పారిశుధ్యం అస్తవ్యస్తం!

> జిల్లా కేంద్రంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉంది. సరైనా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపై పారుతోంది. మురుగు కాలువల్లో పూడిక నిండి ఉంది. రానున్నది వర్షాకాలం కావడంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెంది వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఈ సమస్యను వివరిస్తూ కథనం...



లక్ష్మీనగర్‌లో ఇళ్ల మధ్య మురుగు నీరు, అందులోనే ప్లాస్టిక్ కవర్లతో చెత్తను వేసిన దృశ్యం

- వార్డుల్లో రోడ్లపై పారుతున్న మురుగు నీరు
- డ్రెయినేజీల్లో పేరుకుపోయిన పూడిక
- వర్షాలు పడితే వ్యాధులు ప్రబలే అవకాశం



హైటెక్‌సిటీ కాలనీలో రోడ్లపై పారుతున్న మురుగు

మంచిర్యాలటౌన్: వర్షాకాలం సమీపిస్తుండగా, ఇప్పటికీ మంచిర్యాల మున్సిపాలిటీలోని వార్డుల్లో పూర్తిస్థాయిలో పారిశుధ్య పనులను చేపట్టలేదు. వేసవిలోనే డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, డ్రెయినేజీ నీరు సాఫీగా ముందుకు వెళ్లేలా పనులు చేపట్టాల్సి ఉంది. ఏటా మే నెల చివరి నుంచి జూన్ మొదటి వారంలోపు పట్టణ ప్రగతి పేరిట గతంలో వార్డుల్లోని సమస్యలను గుర్తించి, వర్షాలు కురవకముందే పనులను చేపట్టేవారు. కానీ ఈ ఏడాది ముందస్తు చర్యలు మాత్రం తీసుకోకపోవడంతో, డ్రెయినేజీల్లోని పూడికతీత పనులు 36వార్డుల్లో పూర్తి చేయలేదు. వర్షాలు కురిస్తే, వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ప్రస్తుతం రోడ్లపై డ్రెయినేజీ నీరు పారుతూ, మురుగు గుంతలు ఏర్పడుతుంటే, వర్షాలు తోడైతే వార్డుల్లోని రోడ్లన్నింటిపైన ఈ మురికి నీరు వర్షపు నీటితో కలిసి పారి, దుర్వాసన వెదజల్లే అవకాశం ఉంది. మంచిర్యాల పట్టణంలో వర్షాకాలంలో వరదలు ముంచెత్తుతూ, పలు కాలనీలు వరద నీటిలో మునిగి పోతున్నాయి. డ్రెయినేజీల్లో నుంచి వరద నీరు పారకపోవడం, లోతట్టు ప్రాంతాలు డ్రెయినేజీ నీటితో నిండి ఉండడం వల్ల వరద నీరు ఇళ్లల్లోకి చేరుతోంది. గత మూడేళ్లుగా మంచిర్యాల పట్టణంలోకి కొన్ని కాలనీలు వరద నీటిలో మునిగి పోతుండగా, ముందస్తు చర్యలు చేపట్టడంలో అధికారులు తాత్సారం చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు కురవకముందే వార్డుల్లోని అన్ని కాలనీల డ్రెయినేజీల్లో పూడికతీత పనులు పూర్తి చేయడంతో పాటు, మురికి నీరు నిలిచిన ప్రాంతాల్లో నీరు నిలవకుండా చేయాల్సి ఉంది.

నెమ్మదిగా సాగుతున్న పనులు..

మంచిర్యాల మున్సిపాలిటీలో 36వార్డులు ఉండగా, 29వేల వరకు నివాస గృహాలు ఉన్నాయి. అతి పెద్ద పట్టణం కావడంతో, మే నెల మొదటి వారంలోనే డ్రెయినేజీల్లో పెరిగిన పిచ్చి మొక్కల తొలగింపు, అందులో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించాల్సి ఉంది. పనులను ఆలస్యంగా ప్రారంభించడం, జేసీబీ ఒక్కటే ఉండడం వల్ల అన్ని వార్డులకు పంపించలేని పరిస్థితి నెలకొంది. దీంతో మరో 15రోజులు విరామం లేకుండా పనులను చేస్తేనే డ్రెయినేజీల్లోని పూడికతీతను తొలగించి, పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించేందుకు అవకాశం ఉంటుంది. వర్షాలు కురిస్తే మాత్రం పనులను చేపట్టడం కష్టమే. పనుల్లో వేగం పెంచేందుకు అవసరం మేరకు మరిన్ని జేసీబీలతో పాటు, ఇతర వాహనాలను ఏర్పాటు చేస్తే, వర్షాలు పడేకంటే ముందే పారిశుధ్య పనులను పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. వరదల ప్రభావం ఉండే ఎన్టీఆర్‌నగర్, రాంనగర్, పద్మశాలి కాలనీ, ఎల్‌ఐసీ కాలనీ, ఆదిత్య ఎంక్‌లెవ్, పాతమంచిర్యాల, బృందావన్ కాలనీ, సీతారామ కాలనీ, సాయికుంట ప్రాంతాల్లో పనులను వేగవంతంగా చేయాల్సి ఉంది. వరద ముంపు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పూర్తి చేసి, ఇతర ప్రాంతాల్లో చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అన్ని వార్డుల్లో పనులు పూర్తిచేస్తాం



పట్టణంలోని 36వార్డుల్లో పారిశుధ్య పనులు చేపడుతున్నాం. కొన్ని వార్డుల్లో పూర్తి చేసినా, ఇంకా కొన్ని వార్డుల్లో చేయాల్సి ఉంది. వారం రోజుల్లో అన్ని వార్డుల్లో పనులు పూర్తి చేసేలా చూస్తాం. వర్షాలు కురవకముందే పనులను చేయాలనుకున్నా, కొంత ఆలస్యం అవుతున్నాయి. వరద ముంపు ప్రాంతాల కాలనీల్లో ముందుగానే పనులను పూర్తి చేశాం.

- మారుతి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్

అధ్వానంగా అంతర్గత రహదారులు

- మురికి కాలువలు లేక రోడ్లపై పారుతున్న నీరు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



లంబడిపల్లిలో బోరుబావి వద్ద నిలిచిన మురుగు

చెన్నూర్‌రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో మురుగు కాలువలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మొత్తం 30 గ్రామ పంచాయతీలుండగా, సర్పంచుల పదవీకాలం ముగియడంతో పంచాయతీల పాలనను ప్రత్యేకాధికారులకు అప్పగించారు. కానీ గ్రామాల్లో సరైన మురికి కాలువలు లేక మురుగు మొత్తం రోడ్లపై పారుతూ అధ్వానంగా మారుతోంది. లంబడిపల్లి, ఆస్నాద, ఎల్లక్కపేట, కాచన్‌పల్లి, గంగారం, తుర్కపల్లి, పొన్నారం, అక్కెపల్లి, కత్తెరసాల, చింతలపల్లి, శివలింగాపూర్, బుద్దారం, సంకారం, కన్నెపల్లి, కొమ్మెర, అంగ్రాజ్‌పల్లి, ఎర్రగుంటపల్లి, పొక్కూరు, సుందరసాల, దుగ్నెపల్లి, వెంకంపేట తదితర గ్రామాల్లో సరైన మురికి కాలువలు లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై మురికి నీరు పారి మురికి నీటి గుంతలు తయారవుతున్నాయి. మురికి నీరంతా ఒక దగ్గర చేరి దుర్వాసన వెదజల్లుతోంది. ఏళ్ల గడుస్తున్నా గ్రామాల్లో మురికి కాలువలు, అంతర్గత రోడ్ల దుస్థితి మాత్రం మారడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఈ సమస్య ఇలాగే ఉంటే సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకొని గ్రామాల్లో మురికి కాలువలు ఏర్పాటు చేయించి ఈ కష్టాల నుంచి గట్టెక్కించాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

మండలంలోని ఏయే గ్రామాల్లో మురికి కాలువలు సక్రమంగా లేవో గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం. అలాగే రోడ్లపై మురికి నీరు పారకుండా సత్వరమే చర్యలు తీసుకుంటాం. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తాం. **- అజ్మత్ అలీ, ఎంపీవో, చెన్నూర్**

19న వేలం

నస్పూర్: పట్టణ పరిధిలోని తీగల్‌పహాడ్ యాదవ నగర్ మేకల మార్కెట్, పట్టణంలో నిర్వహించే వారసంతలు, తైబజార్‌లకు ఈ నెల 19న ఉదయం 11 గంటల నుంచి మున్సిపల్ కార్యాలయం వద్ద వేలం నిర్వహించనున్నట్లు కమిషనర్ సతీష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ప్రతీ వేలానికి రూ.50వేల చొప్పున కమిషనర్ నస్పూర్ మున్సిపాలిటీ పేరు మీద ఈ నెల 13 నుంచి 15వరకు బ్యాంకు డీడీలు తీసి మున్సిపల్ కార్యాలయంలో అప్పగించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని కమిషనర్ సూచించారు.

గ్రాట్యుటీ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఈవో శ్రీనివాస్

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో అర్చకుడిగా పనిచేసి, ఉద్యోగ విరమణ పొందిన మునవాల సత్యనారాయణస్వామికి రూ.2లక్షల రిటైర్డ్‌మెంట్ గ్రాట్యుటీ మంజూరు కాగా ఆ చెక్కును ఈవో శ్రీనివాస్ మంగళవారం ఆయనకు అందజేశారు. ప్రధాన అర్చకుడు రఘుస్వామి, అర్చకుడు జయస్వామి, సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అటవీ ఆంక్షలు ఎత్తివేయాలని వినూత్న నిరసన



నిరసన తెలుపుతున్న భూమాచారి

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్‌లో వాహనాల రాకపోకలపై ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మార్కెట్‌లో సామాజిక వేత్త శ్రీరాముల భూమాచారి వినూత్న నిరసన తెలిపారు. అటవీ ఆంక్షలతో కూడిన బ్యానర్‌ను ధరించి మార్కెట్‌లో ప్రదర్శన చేశారు. అటవీ ప్రాంతం గుండా వాహనాల రాకపోకలను నిషేధించడం వల్ల మండల ప్రజలు అనేక రకాలుగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

వయోపరిమితి పెంపుపై ఐఎన్టీయూసీ హర్షం

మందమర్రిరూరల్: సింగరేణిలో కార్మికుల డిపెండెంట్‌లకు ఉద్యోగ అవకాశం కోసం 35 నుంచి 40సంవత్సరాలకు యాజమాన్యం పెంపుపై ఐఎన్టీయూసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఏరియాలోని ఐఎన్టీయూసీ ఆఫీస్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. గత ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ వయోపరిమితి పెంపుపై హామీ ఇచ్చిందని, దాని అమలు కోసం ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ కృషి చేశారని తెలిపారు. సమావేశంలో యూనియన్ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు భీమయ్య, నాయకులు లక్ష్మణ్, చంద్రశేఖర్, తిరుపతి, రాములు, శ్రీకాంత్, బాపు, సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.

సూపర్ బజార్‌లో సరుకులు అందించేలా చూడాలి

మందమర్రిరూరల్: సింగరేణి సూపర్ బజార్‌లలో అన్ని సరుకులు ఒకేచోట లభించేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎమ్మెస్ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు జక్కనబోయిన శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సింగరేణి ప్రాంతం దినదినాభివృద్ధి చెందుతున్న తరుణంలో ఉద్యోగులు వస్తువుల కోసం సమీప పట్టణాల్లో డీ మార్ట్ లాంటి షాపులకు వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. సింగరేణి సూపర్‌బజార్‌లలో నాణ్యమైన సరుకులు అందిస్తున్నారు కానీ, అన్ని సరుకులు అందుబాటులో ఉంచడం లేదని, అన్ని సరుకులు అందుబాటులో ఉంచినట్లైతే సింగరేణి కార్మికులకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

మారుమోగిన శివనామస్మరణ



పూజలు చేస్తున్న వేదపండితులు

వేమనపల్లి: మండలంలోని దస్నాపూర్ గ్రామ శివారులో శివనామస్మరణతో శివపంచాయతన అభయాంజనేయ సుబ్రహ్మణ్య దేవస్థానం మారుమోగింది. ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో వేదపండితులు కార్తీక్ శర్మ, రేవనారాధ్యపీఠాధిపతి రాజమౌళిచార్యులు, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాయజ్ఞం చేసి రుద్రాభిషేకం చేశారు. 50మంది దంపతులు నియమ నిష్టలతో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు నిర్వహించారు. ఆధ్యాత్మిక భజన కార్యక్రమం నిర్వహించారు. మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్ దంపతులతో పాటు అర్చకులు దిలీప్‌శర్మలు పాల్గొన్నారు.

ఇంటింటా 'భగీరథ' సర్వే



వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీవో

జన్నారం: మండలంలోని పొనకల్ మేజర్ గ్రామ పంచాయతీలో భగీరథ నీటి గురించి, పనులపై ఇంటింటా సర్వే నిర్వహించారు. ఎంపీడీవో శశికళ, ఈవో రాహుల్‌లు ఇంటింటికీ వెళ్లి భగీరథ నీరు అందుతున్న విధానం, కుళాయిల బిగింపు, పైపులైన్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం సర్వే నిర్వహిస్తున్నామని, నివేదికలను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

నేడు విజయోత్సవ ర్యాలీ

చెన్నూర్: పట్టణానికి చెందిన ఏల్పుల పోచం కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చేపట్టిన కళాయాత్ర ముగించుకొని చెన్నూర్‌కు వస్తున్న సందర్భంగా బుధవారం పట్టణ ప్రజలు ఘన స్వాగతం పలకనున్నారు. స్థానిక జలాల్ పెట్రోల్ బంక్ నుంచి మారెమ్మవాడ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పోచం మిత్ర బృందం సభ్యులు తెలిపారు. విజయోత్సవ ర్యాలీలో చిత్ర కళాకారులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆర్థిక సాయం



మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని దొనబండకు చెందిన తాళ్లూరి వెంకటకృష్ణ పది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించాడు. కాగా విషయం తెలుసుకున్న తనతో పాటు 2010–2011 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన మిత్రులు, రూ.28వేలు సేకరించి మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు.

మా ఊరి టీచర్‌ను బదిలీ చేయండి

- ఎంఈవోకు దుగినేపల్లి గ్రామస్తుల వినతి



ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

బెల్లంపల్లి: విధులకు సక్రమంగా హాజరు కానీ తమ గ్రామ ప్రభుత్వ ఉపాధ్యాయుడిని బదిలీ చేసి కొత్తగా మరో ఉపాధ్యాయుడిని నియమించాలని బెల్లంపల్లి మండలం దుగినేపల్లి గ్రామస్తులు కోరారు. బెల్లంపల్లి ఎంఈవో మహేశ్వర్ రెడ్డికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సరిగ్గా విధులకు హాజరు కాకపోవడంతో తల్లిదండ్రులు అనివార్యంగా ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్నారని తెలిపారు. అప్పులు చేసి ప్రైవేట్‌లో చదివించాల్సి వస్తుండటంతో అనేక మంది పిల్లలు బడిమానేయాల్సి వచ్చే పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. గతంలో తమ పాఠశాల ఉపాధ్యాయుడు విధులకు ఎగనామం పెట్టడంతో రాజు కాంబ్లే అనే ఉపాధ్యాయుడిని పంపించారని తెలిపారు. సదరు ఉపాధ్యాయుడు కూడా సక్రమంగా పాఠశాలకు రాకపోవడంతో విద్యార్థుల చదువుకు ఆటంకం కలిగిందన్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ నడుస్తుండటంతో రాజు కాంబ్లేను మరో పాఠశాలకు బదిలీ చేసి, కొత్త ఉపాధ్యాయుడిని నియమించి పిల్లల చదువుకు ఆటంకం కలగకుండా చూడాలని ఎంఈవోను కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు జుమ్మిడి బానయ్య, సల్లూరి శ్రీనివాస్, కాసిపాక విజయ్, కోట వెంకట స్వామి, సల్లూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



అధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మందమర్రిరూరల్: సింగరేణిలో కార్మికుల సమస్యలు పేరుకుపోతున్నాయని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టబోయే ఆందోళనలకు కార్మికవర్గం సిద్ధంగా ఉండాలని ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఏరియాలోని కేకే–ఓసీపై మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మూడు నెలల క్రితం డిపెండెంట్ ఉద్యోగం కోసం ఉద్యోగ వయస్సు 40సంవత్సరాలకు పెంచాలనే యూనియన్ డిమాండ్ మేరకు యాజమాన్యం స్పందించడం కార్మికుల విజయం అన్నారు. అలాగే గత ఆర్థిక సంవత్సరం సంస్థకు వచ్చిన లాభాల్లో 35శాతం పంపిణీ చేయాలని, కోలిండియా మాదిరిగా సింగరేణిలో పెర్క్స్‌పై పన్ను యాజమాన్యమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై గని అధికారికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని 'బడిబాట'



బూర్గుపల్లిలో చిన్నారికి అడ్మిషన్ ఫాం అందిస్తూ..

భీమారం/కాసిపేట: పాఠశాలలకు వేసవి సెలవులు ముగిసి బుధవారం పాఠశాలలు ప్రారంభం కానుండటంతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాఠశాలలను సిద్ధం చేశారు. మంగళవారం పలు చోట్ల గ్రామసభలు నిర్వహించారు. బడి బయట పిల్లల వివరాలు, నమోదు అంశాన్ని చర్చించి ప్రతి ఒక్కరూ బడి బయట లేకుండా పాఠశాలల్లో చేర్పించాల్సిందిగా సూచించారు. పాఠశాలల వసతులు, ఇతర అంశాలపై చర్చించి పనులు త్వరగా పూర్తి చేయాల్సిందిగా ఆదేశించారు. కొన్ని గ్రామాల్లో పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ 'బడిబాట' నిర్వహించారు. బడి ఈడు వచ్చిన వారిని విధిగా పాఠశాలలో చేర్పిస్తే నాణ్యమైన విద్యని అందిస్తామని ఉపాధ్యాయులు వివరించారు. పాఠశాల ప్రారంభం మొదటి రోజే విద్యార్థులకు యూనిఫాం అందించాలనే లక్ష్యంతో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా యూనిఫాంలు పాఠశాలలకు చేరాయి. బుధవారం నుంచి విద్యార్థులకు యూనిఫాంలు అందించనున్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన



నిరసన తెలుపుతున్న ఏఈవోలు

చెన్నూర్‌రూరల్: మహబూబాబాద్ జిల్లాలో జీలుగ విత్తనాల పంపిణీలో అక్రమాలు జరిగాయని ముగ్గురు ఏఈవోలను అకారణంగా సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ మండలంలోని కిష్టంపేట గ్రామంలోని రైతువేదిక వద్ద ఏఈవోలు నిరసన వ్యక్తం చేశారు. అక్రమాలకు పాల్పడిన వారిని విడిచిపెట్టి సంబంధం లేని ఏఈవోలను సస్పెండ్ చేయడం తమను ఆవేదనకు గురి చేసిందన్నారు. వెంటనే సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

మొక్కల పంపిణీకి సిద్ధంగా ఉండాలి



నర్సరీని పరిశీలిస్తున్న మేనేజర్లు

వేమనపల్లి: హరితహారం మొక్కల పంపిణీకి మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో సిబ్బంది సిద్ధంగా ఉండాలని అంబుడ్స్‌మెన్ శివరాం, జిల్లా ప్లానిటేషన్ మేనేజర్ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని గొర్లపల్లి, దస్నాపూర్, వేమనపల్లి గ్రామపంచాయతీల్లో మంగళవారం నర్సరీలను పరిశీలించారు. ఉద్యమంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని, ఎలాంటి నిర్లక్ష్యం వహించినా సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏపీవో సత్యప్రసాద్, ఈసీ మధుకర్, టీఏలు కృష్ణ మోహన్, శ్రీనివాస్, లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శులు యూసఫ్, శ్యాంచంద్ పాల్గొన్నారు.

పంటలపై రైతులకు అవగాహన



పాల్గొన్న రైతులు

లక్సెట్టిపేట: స్థానిక రైతువేదిక భవనంలో మంగళవారం మండల వ్యవసాయాధికారులు పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. విత్తనాల ఎంపిక, అధిక సాంద్రత పత్తి పంట సాగు విధానం, సేంద్రియ వ్యవసాయంపై సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చెల్లా ప్రభాకర్ రెడ్డి, సిబ్బంది అజిత్‌కుమార్, సంగీత, కృష్ణ, ఏఈవోలు పాల్గొన్నారు.

'నిషేధిత పత్తివిత్తనాలు కొనుగోలు చేయకండి'

భీమారం: ప్రభుత్వం నిషేధించిన నకిలీ పత్తి విత్తనాలను కొనుగోలు చేయొద్దని ఏవో మార్క్ గ్లాడ్‌స్టన్ మంగళవారం రైతులను కోరారు. మండలంలో ఇప్పటికే నకిలీ విత్తనాలను పట్టుకున్నామని తెలిపారు. ఇంకా చాలా మంది రైతులు వాటి కోసం ఎదురుచూస్తున్నారని సమాచారం ఉందని, నిషేధిత విత్తనాలతో పంట పండిస్తే భూసారం దెబ్బతింటుందన్నారు. ఈ విషయంలో పంటభూమలను ధ్వంసం చేసే విత్తనాలకు దూరంగా ఉండాలని, ప్రభుత్వం గుర్తించిన పత్తివిత్తనాలను కొనుగోలు చేసుకోవాలని ఏవో రైతులను కోరారు.

గుంత.. ప్రయాణికుల చింత

అటెన్షన్ ప్లీజ్..



భీమారం: మండల కేంద్రంలోని బీసీ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిపై గల కల్వర్టు గుంతలు పడి దెబ్బతినడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గతంలో ఎన్నోసార్లు ప్రభుత్వం దృష్టికి తీసికెళ్లినా పట్టించుకోకపోవడంతో స్థానికులు అందరూ కలిసి ఒర్రెపై పైపులు వేసి కల్వర్టు తాత్కాలికంగా నిర్మించుకున్నామని తెలిపారు. అయితే ఇప్పుడు బోర్‌వెల్ లారీ వెళ్లడంతో కల్వర్టు పైపులు పగిలి రంధ్రాలు అయినట్లు వాపోయారు. అధికారులు స్పందించి కొత్త కల్వర్టు నిర్మించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సంబంధిత అధికారి : సతీష్‌రెడ్డి, ప్రత్యేకాధికారి, భీమారం
ఫోన్ నంబర్ : 98483 84636

కిష్టాపూర్ విద్యార్థికి సీఎం అభినందన



జన్నారం: మండలంలోని కిష్టాపూర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదివి పది జీపీఏ పాయింట్లు సాధించిన రాథోడ్ ఈశ్వర్‌కు అరుదైన గౌరవ లభించింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ముఖాముఖిలో పాల్గొన్న ఈశ్వర్‌ను మెడల్, ప్రశంసాపత్రంతో సత్కరించి అవార్డు అందజేసినట్లు పాఠశాల హెచ్ఎం గుండ రాజన్న తెలిపారు.